క్లుప్తంగా

అయ్యప్పలకు అన్నదానం



ఫిరంగిపురం: వేములూరిపాడు గ్రామంలోని జలపాలేశ్వరస్వామి ఆలయంలో అయ్యప్ప స్వాములకు అన్నదానం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆలయంలో ఈ నెల 18 నుంచి గ్రామస్తులు, భక్తుల సహకారంతో ప్రారంభించిన అన్నదానం 41 రోజుల పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి రోజు మూడు వందల వరకు ఇక్కడకు వస్తున్నారని చెప్పారు.

29న మెగా ఉచిత గుండె వైద్య శిబిరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): పటమటలోని పీవీఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ నెల 29న తాడేపల్లి సమీపంలోని నులకపేట చైతన్య తపోవన్‌లో ఉచిత మెగా గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి గౌరవాధ్యక్షుడు వావిలాల రజనీకాంత్ శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో గుండెతో పాటు, మెదడు, నరాలు, కిడ్నీలు, ఈఎన్‌టీ, ఎముకలు–కీళ్లు, గైనకాలజీ సమస్యలను కూడా పరీక్షించనున్నట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండా ఈసీజీ, ఎకో కార్డియాలజీ పరీక్షలు, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆ రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

క్లూస్ టీం ఆధారాల సేకరణ



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కోనేరు కట్ట సమీపంలో ఉన్న హెల్త్ వెల్‌నెస్ సెంటర్లో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించింది. కాగా దీనిపై ఆరోగ్య సిబ్బంది ఉన్నతాధికారులకు, పోలీసులకు తెలియజేశారు. దీంతో సోమవారం గుంటూరు నుంచి క్లూస్‌టీం ఏఎస్ఐ షేక్ కరిముల్లా, మరో సభ్యుడు వచ్చారు. ప్రమాదం జరిగిన చోట ఆధారాలు కోసం కొన్ని కాలిన వస్తువులను, బూడిదను సేకరించారు. అన్ని ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ ఏఎస్ఐ ఎస్‌కే. మొహిద్దీన్ సేకరించిన ఆధారాలను ఉన్నతాధికారులకు తెలియజేస్తారని చెప్పారు.

మహా సభను జయప్రదం చేయండి



తాడికొండ: కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతాంగ ప్రజా వ్యతిరేఖ విధానాలను నిరసిస్తూ మంగళవారం గుంటూరులో జరిగే ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ, సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివ శంకరరావు కోరారు. జన సమీకరణలో భాగంగా సోమవారం తాడికొండ గ్రామానికి విచ్చేసిన వారు కరపత్రాలు విడుదల చేసిన అనంతరం మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ వ్యతిరేఖ విధానాలను నిరసిస్తూ గుంటూరులోని బీఆర్ స్టేడియం నుంచి మార్కెట్ వరకు భారీ ర్యాలీ జరుగుతుందన్నారు. భారీ బహిరంగ సభ కొనసాగుతుంది కనుక భారీగా హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు, కుర్రా అనిల్‌కుమార్, కె.పూర్ణయ్య, రేపూడి శ్రీనివాసరావు రైతులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఎంపీహెచ్‌వో బ్రహ్మారెడ్డికి నివాళి



తాడికొండ: తుళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య విస్తరణాధికారిగా (ఎంపీహెచ్‌వో)గా పనిచేస్తున్న వజ్రాల బ్రహ్మారెడ్డి ఆకస్మిక మృతి బాధాకరమని పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ వసుంధర, శివపార్వతి అన్నారు. ఆదివారం గుండెపోటుతో బ్రహ్మారెడ్డి మరణించగా సోమవారం తుళ్లూరు పీహెచ్‌సీలో సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. 2011 నుంచి పీహెచ్‌సీలో ఆరోగ్య విస్తరణాధికారిగా సేవలందించారని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకట రమణ, ఎంఎస్ రాణి, నాగమ్మ, విజయ కుమారి, శ్రీనివాస రెడ్డి, కరీం, లక్ష్మీ నారాయణ, ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

అలా కలరింగ్ ఇచ్చారు..
ఇలా వదిలేశారు



సెప్టెంబర్ 10న రోడ్డు చదును చేయిస్తూ.. టీడీపీ నేతల హడావుడి (ఫైల్)



ఎర్రవాగు వంతెన వద్ద ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

- వరదలకు దెబ్బతిన్న కంతేరు రహదారి
- రోడ్డు వేయిస్తామని టీడీపీ నాయకుల హడావుడి
- పొక్లెయిన్‌తో రోడ్డు చదును చేసి, ఫొటోలకు ఫోజులు
- మూడు నెలలు కావస్తున్నా పత్తా లేని నాయకులు
- గుంతలు, మరమ్మతుల పేరుతో వేసిన బండ రాళ్లతో ప్రయాణం ప్రమాదం

తాడికొండ: తెలుగుదేశం పార్టీ నాయకుల నిబద్ధతకు నిదర్శనం ఈ చిన్న సంఘటన. టీడీపీది అంతా పబ్లిసిటి పీక్..మ్యాటర్ వీక్ అనేందుకు ఇదో ప్రత్యక్ష సాక్ష్యం. ఏమీ చేయకపోయినా..ఏదో చేసేస్తామన్న ప్రచారం తప్ప.. తమ వల్ల ఏదీ చేత కాదనేది మరోసారి రుజువు చేశారు. నవ్విపోదురు కదా నాకేమి సిగ్గు అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. తాడికొండ మండల పరిధిలోని ఇది మరోసారి తేటతెల్లమైంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు కొండవీటి వాగు పొంగి ప్రవహించింది. దీంతో కంతేరు– తాడికొండ గ్రామాల మధ్య రోడ్డు పూర్తిగా మునిగిపోయింది. అనంతరం గుంతలమయంగా మారింది. పది రోజులకు పైగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులు మంగళగిరి నుంచి విజయవాడ వెళ్లేందుకు చుట్టూ తిరిగి వస్తున్నా పట్టించుకున్న నాథుడు లేడు. ఈ సమస్యలపై సాక్షి పత్రికలో 'వరదలు తగ్గినా దారిద్రం తీరలేదు' అని కథనం ప్రచురించితమైంది. దీంతో టీడీపీ నాయకులు హడావుడిగా రంగంలోకి దిగి బిల్డప్‌లు ఇచ్చేశారు. ఎమ్మెల్యే ఆదేశాలతో ఆర్ అండ్ బీ అధికారులు మరమ్మతులకు వచ్చేశారు అంటూ ఎస్‌ఈని వెంటేసుకొనొచ్చారు. రోడ్డులో రెండు లారీల బండరాళ్లు తెప్పించి, గుంతలను పొక్లెయినర్‌తో సరిచేయించి, ఫోటోలకు ఫోజులిచ్చేశారు. తామే స్వచ్ఛందంగా మరమ్మతులు చేస్తున్నామంటూ కంతేరుకు చెందిన టీడీపీ నాయకుడు పత్రికల్లో కథనాలు రాయించుకున్నారు. మరుసటి రోజు మరో అడుగు ముందుకేసి సాక్షి పత్రికపై తమకున్న అక్కసంతా తీర్చేసుకొని ఎల్లో మీడియాలో పబ్లిసిటి చేసుకున్నారు. ఇంకేముంది తాడికొండ– కంతేరు రోడ్డు సుందరంగా మారుతుందని కలలు గన్న ప్రయాణికుల ఆశలు అడియాశలు కాక మానలేదు. ఈ తంతు జరిగి మూడు నెలలు కావస్తున్నా ఆ వైపు తొంగి చూసిన నాయకుడు, అధికారులు లేరు. ఫలితంగా భారీ గుంతలు, రోడ్డు పక్కన వేసిన బండరాళ్లు, కోతకు గురైన రహదారి దర్శనమిస్తూ ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు చేస్తున్నాయి. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇకనైనా స్పందించి కంతేరు– తాడికొండ రహదారికి పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



రోడ్డుపై పగుళ్లిచ్చి ప్రమాదకరంగా ఉన్న వంతెన

నారా లోకేష్ పిలుపు కోసం



నారా లోకేష్ కోసం ఎదురు చూస్తున్నట్లుగా ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల నిరసన

తాడేపల్లిరూరల్ : రాష్ట్ర మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ పిలుపు కోసం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు ఎదురు చూస్తున్నారని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు అన్నారు. సోమవారం బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యంతో చర్చలకు కార్మికులను పిలుస్తారని ఎదురు చూస్తున్నారన్నారు. కోర్టు ఆర్డర్లను సైతం అమలు చేయకుండా సంబంధిత యజమానుల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని, ఏసీసీ కార్మికులకు నష్ట పరిహారం చెల్లించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ నాయకులు కె.ఆదినారాయణ, కె.స్టీవెన్, బి.అంకయ్య, ఎం.ఆశీర్వాదం, యెహోషువా, జానీ, సాంబయ్య, గురవయ్య, సుభాని, నాగేశ్వరరావు, రమాదేవి, శారద, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఐడీసీ చైర్మన్ డేగల ప్రమాణస్వీకారం



ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న డేగల ప్రభాకరరావు

తాడేపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఐడీసీ) చైర్మన్‌గా డేగల ప్రభాకరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నాకు ఈ బాధ్యత అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు, మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తానని చెప్పారు. పరిశ్రమల ద్వారానే నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగాల కల్పన సాధ్యమవుతుందని, ప్రతి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా ప్రభాకరరావుకు టీడీపీ జిల్లా అధ్యక్షులు, తాడికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, ఏపీఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ వి.రఘునాథ్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఐడీసీ సిబ్బంది ఎం.రామకృష్ణ, వైఎస్ఎస్ సురేష్, సిహెచ్.దుర్గ ప్రసాద్, వై.కృష్ణ పాల్గొన్నారు.

శివాలయాల్లో కార్తిక శోభ



దీపాలు పెడుతున్న మహిళలు



విశేష అలంకారంలో ఉమా మహేశ్వరస్వామి

ఫిరంగిపురం: మండలంలోని పలు శివాలయాలు కార్తిక మాసం చివరి సోమవారం భక్తులతో కిక్కిరిసాయి. ఉదయాన్నే ఆలయాలకు చేరుకున్న భక్తులు దీపాలు వెలిగించి, స్వామివార్లను దర్శించుకున్నారు. ఫిరంగిపురంలోని కాళహస్తీస్వర స్వామి ఆలయంలో అర్చకులు ఆంజనేయశర్మ స్వామికి రుద్రాభిషేకం చేశారు. నగరేశ్వరుడికి అర్చకులు రాజేంద్రశర్మ నమకచమకాలతో విశేష అర్చనలు నిర్వహించారు. గరుడాచలపాలెంలోని ఉమామహేశ్వరస్వామికి అర్చకులు లక్ష్మీనారాయణశాస్త్రి పంచామృతాలతో అభిషేకాలు, బిల్వదళాలతో అర్చనలు చేశారు. నుదురుపాడులోని కాశీవిశ్వేశ్వర స్వామికి అర్చకులు హనుమత్‌శాస్త్రి, ఆంజనేయశాస్త్రిలు విశేష అర్చనలు, అమ్మ వారికి కుంకుమపూజలు చేశారు. వేమవరంలోని కోటిలింగాల క్షేత్రంలో భక్తులు లింగాల చుట్టూ దీపాలు వెలిగించి మరకతలింగానికి అభిషేకాలు చేశారు.

శివాలయంలో పోటెత్తిన భక్తులు

మంగళగిరి: పట్టణంలో వేంచేసి ఉన్న గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానాకి భక్తులు పోటెత్తారు. కార్తిక సోమవారం చివర వారం కావడంతో భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయానికి బారులు తీరారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని కార్తిక దీపాలు వెలిగించి, క్యూలైనులో ఉండి స్వామి వారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో జేవి నారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.

లింగ వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్

ఫిరంగిపురం: లింగ వివక్షకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ ఏక స్వరంతో ఉద్యమించాలని ఎంపీపీ షేక్.షహేలా నర్గీస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం లింగ వివక్షకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మార్పు మొదలైందని మహిళలు తమ హక్కుల కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తి రేణమ్మ మాట్లాడుతూ మహిళలు ఎంతో మంది ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని చెప్పారు. ఏపీఎం నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి డిసెంబర్ 23 వరకు మహిళలకు ప్రోత్సాహంగా, బాలికారుణ్య, వివాహ చట్టం, గృహ హింస వంటి వాటిపై అవగాహన కల్పించడంతో పాటు సెమినార్లు, ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు, డ్వాక్రా సంఘాల మహిళలు, సీసీలు, యానిమేటర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి



తాడేపల్లిరూరల్ : కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిస్తూ మంగళవారం దేశ వ్యాప్తంగా 500 కలెక్టరేట్ల వద్ద నిర్వహించనున్న కార్మిక కర్షక ప్రదర్శన ధర్నాలను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు పిలుపునిచ్చారు. సోమవారం తాడేపల్లిలో రైతాంగాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ వ్యవసాయ నల్ల చట్టాలను వెనక్కి తీసుకుంటామని, పంటలకు కనీస మద్దతు ధర చట్టాన్ని తీసుకువస్తామని, విద్యుత్ సంస్కరణలు అమలు చేస్తామని చెప్పి, రైతు ఉద్యమం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని మండిపడ్డారు. ఈ ప్రచార కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, డి.విజయ భాస్కర్‌రెడ్డి, సీఐటీయూ నాయకులు బి. వెంకటేశ్వరరావు, బర్నబాస్, జి. శ్రీను పాల్గొన్నారు.

నేడు భారత రాజ్యాంగ దినోత్సవం

తాడేపల్లిరూరల్ : డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ దినోత్సవాలను జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం ఆత్మకూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలుకు రిజిస్ట్రేషన్ ప్రారంభం



ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఓ శిరీష

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలుకు సంబంధించి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైందని మండల వ్యవసాయ అధికారి పి.శిరీష తెలిపారు. సోమవారం పలు గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఖరీఫ్‌లో పంట నమోదు చేయించుకుని, ఈకేవైసీ పూర్తి చేసుకున్న రైతులందరూ ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యం అమ్ముకోవచ్చని చెప్పారు. గ్రేడ్ ఏ క్వింటాకు రూ.2,320, 75 కేజీలకు రూ.1,740లు, గ్రేడ్ బీ క్వింటాకు రూ.2,300, 75 కేజీలకు రూ.1,725లుగా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందని, తేమ 17శాతం ఉండేలా రైతులు చూసుకోవాలని, జీడీఎంఎస్ ఆధ్వర్యంలో టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు తేమ శాతం, ఇతర ప్రామాణికాలు పరిశీలించి ధాన్యం రైతులు కోరుకున్న మిల్లులకు పంపవచ్చన్నారు. మిల్లర్లు గోతాలు అందజేస్తారని తెలియజేశారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని గిట్టుబాటు ధరకు ధాన్యం విక్రయించడానికి రైతు సేవా కేంద్రం వద్ద తమ పేర్లను నమోదు చేయించుకోవాలని ఆమె తెలిపారు.

కోట్ల రూపాయల ఆస్తిని కాజేశారు

- మా భూమిని ఇప్పించండి
- అదే మాకు ఆధారం
- ప్రజా దర్బార్‌లో వినతిపత్రం అందజేత



ప్రజా దర్బార్‌లో మంత్రి నారా లోకేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న ప్రజలు

తాడేపల్లి రూరల్: కుటుంబ అవసరాల నిమిత్తం మూడు లక్షల రూపాయలు అప్పు తీసుకుంటే కోట్ల రూపాయల ఆస్తిని తమ సొంతం చేసుకుంటున్నారని, తమకు ఆధారమైన ఆ భూమిని ఇప్పించాలని కోరుతూ సోమవారం ప్రజాదర్బార్‌లో మంత్రి నారా లోకేష్‌కు ఓ మహిళ వినతిపత్రం అందజేసింది. బాధిత మహిళ, ఆమె బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడేపల్లికి చెందిన గరుకు కృష్ణకుమారి ఇప్పటం గ్రామానికి చెందిన ముప్పంగి మధుసూధన్‌రెడ్డి వద్ద తన పుట్టింటి నుంచి వచ్చిన మూడు ఎకరాల పది సెంట్ల భూమిని మూడు లక్షల పదివేల రూపాయలకు తాకట్టు పెట్టింది. దాన్ని మధుసూధన్‌రెడ్డి నగదు చెల్లిస్తామన్నా ఇవ్వకుండా తన దగ్గరే పెట్టుకున్నాడని, ఆ భూమి తనది అంటూ బెదిరిస్తున్నాడని, విచారణ చేసి తమకు న్యాయం చేయాలని ఆ మహిళ కోరింది.

- మంగళగిరికి చెందిన షేక్ రోజా అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్న తమకు ఇంటి స్థలం మంజూరు చేసి ఆదుకోవాలని వినతిపత్రం అందజేసింది.
- పెదవడ్లపూడికి చెందిన అన్నే కృష్ణ హర్ష, అన్నే కృష్ణ వినోద్‌లు తీసుకున్న అప్పుకు పొలం రాసి ఇవ్వాలంటూ దేవినేని అవినాష్ పేరు చెప్పి బెదిరిస్తున్నారని చినవడ్లపూడికి చెందిన వెనిగళ్ల వెంకటశివరావు ఫిర్యాదు చేశారు.
- తాడేపల్లికి చెందిన బెజ్జం రామకృష్ణారావు ఉన్నత చదువులు చదివిన తమ పిల్లలకు ఉద్యోగ అవకాశం కల్పించాలని వినతిపత్రం సమర్పించారు.
- యర్రబాలేనికి చెందిన మంద్ర నాగేశ్వరరావు తాను దివ్యాంగుడినని, కుటుంబ పోషణ నిమిత్తం ఏదైనా చిన్న వ్యాపారం చేసుకునేందుకు ఆర్థిక సహాయం అందించాలని కోరాడు. పై విషయాలను పరిశీలించిన మంత్రి తగిన సాయం అందిస్తామని భరోసా ఇచ్చారు.

వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి



ప్రభుత్వాసుపత్రిని పరిశీలిస్తున్న చిల్లపల్లి శ్రీనివాసరావు

మంగళగిరి: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిని ఆరు నెలల్లో వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి పరచి ప్రజలకు వైద్య సేవలందిస్తామని ఏపీ ఎంఐఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పట్టణంలో ఆసుపత్రిని సందర్శించి పరిశీలించి వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వాసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి పరచి వైద్యులు, సిబ్బందిని నియమించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు గీతామాధురి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై పని ఒత్తిడి తగ్గించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు

మేడికొండూరు: ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై పని ఒత్తిడి తగ్గించాలని ఎంపీడీఓ తోట చందనకు మండలంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సోమవారం వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమంలో మంజూరైన సీసీ రోడ్స్, సీసీ డ్రెయిన్స్ నిర్మాణ పనులను దగ్గరుండి పర్యవేక్షించి, ఎం.బుక్ రికార్డింగ్, వర్క్ క్వాలిటీ పూర్తి బాధ్యత ఇంజినీరింగ్ అసిస్టెంట్స్‌పై ఉందన్నారు. కానీ ఫీల్డ్ స్థాయిలో అది జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాతృ శాఖ పంచాయతీ రాజ్ ఏఈ వచ్చి పనులను పర్యవేక్షించడానికి పిలిచినా కూడా వెళ్లలేక వేరే పనులలో ఉన్నామని చెప్పాల్సిన దీన స్థితిలో ఉన్నామని ఎంపీడీఓకి వారి సమస్యలను చెప్పుకున్నారు. అసోసియేషన్ అఫ్ సెక్రటేరియట్ ఇంజినీర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, మండల ట్రెజరర్ యమున, మండల ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

తాడేపల్లిరూరల్ : అమరావతి డివిజన్ పరిధిలోని మంగళగిరి, తాడేపల్లి, తుళ్లూరు, అమరావతి, తాడికొండ, పెదకూరపాడు ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కారానికి పరిష్కార వేదిక, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.సంజీవరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మంగళగిరి పట్టణ పరిధిలోని సి.ఎస్.ఆర్ కల్యాణ మండపంలో ఉదయం 10 నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని పేర్కొన్నారు. వినియోగదారులు విద్యుత్ బిల్లుల లోపాలు, వోల్టేజ్ హెచ్చు తగ్గులు, ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ తీగల మరమ్మతులు, మీటర్ లోపాలు, సరఫరా అంతరాయం మొదలైన అన్ని విద్యుత్ సమస్యలను అధికారులకు తెలియజేయవచ్చన్నారు. ఈ కార్యక్రమం సీజీఆర్ఎఫ్ విజయవాడ చైర్ పర్సన్ ఎస్.విక్టర్ ఇమ్మానుయేల్ (రిటైర్డ్ జడ్జి) అధ్యక్షత నిర్వహించనున్నామని, ఫోరం సభ్యులు కె.వెంకటకృష్ణ, ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, ఎ.సునీత, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని వినియోగదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు.

పేదల ఇళ్ల స్థలాలకు పోరాటం



మంగళగిరి: నగర పరిధిలోని పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్ల నిర్మాణానికి నిధులు కెటాయించే వరకు సీపీఐ పోరాడుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం నగర పరిధిలోని చినకాకానిలో పేదల ఇళ్ల స్థలాల కొరకు దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యార్లగడ్డ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని చింతలపూడి గ్రామానికి చెందిన అత్తిలి సాంబయ్య (చాకలి చిన్న) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చింతలపూడి గ్రామానికి చెందిన విఘ్న వినాయక భక్త బృందం కమిటీ సభ్యులు మృతదేహానికి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి రూ.12,500 ఆర్థిక సాయం అందజేశారు.